సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



నృసింహ మహా యజ్ఞం
సుందరగిరిపై శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రంలో అతిరుద్ర ప్రయోగ సహిత మహా సుదర్శన నృసింహ మహా యజ్ఞం బుధవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. 8లో ▸



పెద్దింట్లమ్మ జాతరకు సిద్ధం
పెద్దింట్లమ్మ జాతరకు సర్వం సిద్ధమయ్యింది. మార్చి 1 నుంచి 13 వరకు జాతర జరగనుంది. జలదుర్గా గోకర్ణేశ్వరుల కల్యాణం మార్చి 10న నిర్వహించనున్నారు. 8లో ▸



పంట కాలువలు 'ప్రైవేటుకు'!
పంట కాలువ నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించి కూటమి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోంది. ఈ నిర్ణయాన్ని నిపుణులు తప్పుపడుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఆక్రమణ చెరలో కొత్తచెరువు



మోగల్లులో ఆక్రమణ చెరలో కొత్తచెరువు

పాలకోడేరు: మోగల్లు – పాలకోడేరు రహదారి ఆనుకుని కొత్తచెరువు ఆక్రమణకు గురైంది. 4 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువు ఇప్పుడు ఎకరంన్నర మేర మాత్రమే ఉంది. గతంలో ఈ చెరువు రైతులకు ఎంతో ఉపయోగపడేది. కాలక్రమేణా పూడుకుపోవడంతో కుచించుకుపోయింది. ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి సుజాత గతంలో ఈ చెరువును సర్వే చేయించారు. రెండు ఎకరాల మేర ఆక్రమణలకు గురైనట్టు నిర్ధారణ అయ్యింది. **అయినప్పటికీ ఆక్రమణలు తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అక్రమణ నుంచి కాపాడి పూడిక తీయించి చెరువును కాపాడాలని కోరుతున్నారు.**

కాటన్ ధరను తగ్గించాలి



వియత్నాంలో అంతర్జాతీయ టెక్స్‌టైల్ ఫెయిర్‌లో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు

తణుకు అర్బన్: కేంద్ర ప్రభుత్వం కాటన్ ధరను తగ్గిస్తే ఇండియాలో కాటన్ స్పిన్నింగ్ పరిశ్రమ మనుగడ సాగిస్తుందని, దానికనుగుణంగా కాన్సులేట్ కూడా సహకరించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్ర నాథ్ అన్నారు. వియత్నాంలోని హోచిమిన్ నగరంలో జరుగుతున్న అంతర్జాతీయ టెక్స్‌టైల్ ఫెయిర్‌లో భారత కాన్సులేట్ జనరల్ డాక్టర్ విప్ర పాండేతో స్పిన్నింగ్ పరిశ్రమలో ఎదురవుతున్న ఒడిదుడుకులకు సంబంధించి చర్చించినట్లు చెప్పారు. భారత్ నుంచి వియత్నాంకు ఎగుమతులపై దృష్టి పెట్టాలని, కాన్సులేట్ తరపున అన్ని సహకారాలు అందిస్తామని విప్రా పాండే వెల్లడించారన్నారు. వస్త్ర పరిశ్రమను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వియత్నాం కాన్సుల్ హెడ్ ఆఫ్ చాన్సరీ మహేష్ చంద్ గిరి ప్రస్తావించినట్లు చెప్పారు.

వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలన



వెబ్ కాస్టింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి తెలిపారు. వెబ్ కాస్టింగ్ ప్రక్రియను బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా పరిశీలించారు. ఓటు హక్కు కలిగిన పట్టభద్రులంతా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది ఫారం–12ను నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుంటే వారందరికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలు పోస్టు ద్వారా వారి అడ్రస్‌కు పంపామని పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, డీసీవో శ్రీనివాస్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాలు అందుకున్న సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకుని, పోస్టల్ బ్యాలెట్‌ను రిటర్నింగ్ అధికారికి మార్చి 3 ఉదయం 7:59 గంటల లోపు పోస్టు.. లేదా స్వయంగా అందేలా పంపాలన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో విఫలం



బలివేలో మంత్రి, ఎంపీతో కూడిన ఫ్లెక్సీ

నూజివీడు: ఒక వైపు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమ లులో ఉన్నప్పటికీ టీడీపీ నాయకులు కోడ్‌ను ఉల్లంఘించి ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో, బలివేలో అడుగడుగునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అధికార యంత్రాంగం కనీసం పట్టించుకోకపోవడంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నూజివీడు డివిజన్‌కు ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా ఉండి కూడా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నాయంటే అధికార యంత్రాంగం పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది.

ఓం నమో శివరుద్రాయ..
ఓం నమో నీలకంఠాయ..
స్మరణలు మార్మోగాయి.. అభిషేక ప్రియుడిని ప్రసన్నం చేసుకునేందుకు.. ఆదిభిక్షువు సేవలో తరించేందుకు భక్తజనం పోటెత్తింది.. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా శైవ క్షేత్రాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. జిల్లాలోని పంచారామాలు, పట్టిసం, బలివే, వీరంపాలెం తదితర క్షేత్రాలు కిటకిటలాడాయి. గోదావరి, తమ్మిలేరులో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు పరమేశ్వరుడిని **దర్శించి తరించారు.**



బలివేలో రామలింగేశ్వరస్వామి



పాలకొల్లులో క్షీరారామలింగేశ్వరుడు



పట్టిసంలో వీరేశ్వరుడికి అభిషేకాలు



భీమవరంలో సోమేశ్వరుడు



పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయం వద్ద ఇసుక తిన్నెలపై తిరునాళ్ల సందడి

శివోహం.. భజేహం

పోటెత్తిన పట్టిసం

పోలవరం రూరల్: మహాశివరాత్రి పర్వదినాన పోలవరం మండలంలోని పట్టిసం శివక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తుల రాక మొదలైంది. కొవ్వూర్లకోట వంశీకులు తొలి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానమాచరించి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసి గోదావరిలో మైలతి**ప్పలు వదిలారు. భక్తులు కన్నాపురం అడ్డరోడ్డు వద్ద, పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద బస్సులు దిగి** పంట్లపై ఏర్పాటు చేసిన మార్గంలో కాలినడకన గోదావరి నదిని దాటి ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ శివక్షేత్రానికి చేరుకున్నారు. సుమారు లక్ష మంది భక్తులు వచ్చినట్టు అంచనా. సమీప తూర్పుగోదావరి **జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. దేవస్థానం వద్ద ప్రత్యేక అధికారి విశ్వనాథరాజు, ఈఓ నురేష్‌నాయుడు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీ**రభద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీఓఎంవీ రమణ, డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావులు ఫెర్రీ, ఇసుక తిన్నెలు, దేవస్థానం వద్ద తిరుగుతూ భద్రత చర్యలను పర్యవేక్షించారు.



బలివేలో జల్లు స్నానమాచరిస్తున్న భక్తులు

బలివే.. భక్తజన సంద్రం

ముసునూరు: బలివేలోని భలే రామలింగేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం రాత్రి నుంచి భక్తులు పోటెత్తారు. బుధవారం వేకువజాము నుంచే విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జల్లు స్నానాలకు ఎక్కువ మోటార్లు ఏర్పాటు చేయడం భక్తుల రద్దీని నివారించింది. భక్తులు ముందుగా తమ్మిలేరులో, జల్లు స్నానాల వద్ద పుణ్య స్నానాలాచరించి, పితృ దేవతలు, పూర్వీకులకు పిండ ప్రదానాలు చేశారు. అనంతరం స్వామి దర్శనానికి తరలివెళ్లారు. ఆలయానికి మూడు వైపుల నుంచి భక్తులు లోనికి ప్రవేశించారు. మంత్రి కొల్లు పార్థసారథి, ఎమ్మెల్యే ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఎస్పీ ప్రసాద్, ఏలూరుకు చెందిన జడ్జిలు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విశేష సేవలందించారు. వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదాలు, బిస్కెట్లు, మజ్జిగ, తాగునీరు అందించారు.

వీరంపాలెం.. మార్మోగిన శివనామ స్మరణం

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం క్షేత్రం శివనామ స్మరణలతో మార్మోగింది. శ్రీబాలాత్రిపుర సుందరీ విద్య, ఆధ్యాత్మిక పీఠంలో స్ఫటిక లింగ దర్శనానికి భక్తులు పోటెత్తారు. పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణశాస్త్రి పర్యవేక్షణలో మహాదేవునికి నదీ జలాలు, మహాకుంభాభిషేకం నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తులు మల్లికార్జునరావు, లక్ష్మణరావు, రిటైర్డ్ న్యాయమూర్తి శేషసాయి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ సి.నాగరాణి తదితరులు స్వామిని దర్శించి అభిషేకాలు చేశారు. సాయంత్రం శివపార్వతుల దివ్య కల్యాణం, లక్ష జ్యోతిర్లింగార్చన, లింగోద్భవ కాల అభిషేకం, లక్ష జ్యోతి ప్రజ్వలన, జాగరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తుల రాక కొనసాగింది.

క్షీరారామం.. మోక్షధామం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తుల తాకిడి మొదలైంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి విశేష అభిషేకాలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు మహాన్యాసపూర్వక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 8.35 గంటలకు జగజ్జ్యోతి వెలిగించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామివారికి మల్లన్న పాగా అలంకరించారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహించారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామిని దర్శించినట్టు అంచనా. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, పట్టణ సీఐ కె.రజనీకుమార్, ఎస్సై పృథ్వీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులకు భక్తులకు ఉచిత ప్రసాదం, అన్న సమారాధనలు చేశారు.

సోమారామం.. ఆధ్యాత్మిక సౌరభం

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం) శివన్నామ స్మరణలతో మార్మోగింది. వేకువజాము నుంచి భక్తుల రాక మొదలైంది. విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. వేకువజాము నుంచి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభి షేకాలు చేశారు. ప్రధాన అర్చకులు చేకూరి రామకృష్ణ, కందుకూరి సోంబాబు ఆధ్వర్యంలో సాయంత్రం స్వామి వారికి లక్షపత్రి పూజ, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. స్వామిని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు దర్శించుకున్నారు. భక్తులకు స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపార సంస్థల ప్రతినిధులు, మజ్జిగ, మంచినీరు, అల్పాహారం అందజేశారు. సుమారు 15 వేల మంది భక్తులు వచ్చినట్టు అంచనా.



పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



బలివేలో తమ్మిలేరులో తెప్ప వదులుతూ..



వీరంపాలెంలో మహాదేవుడికి అభిషేకాలు చేస్తున్న కలెక్టర్ నాగరాణి





భీమవరంలోని సోమారామంలో భక్తుల రద్దీ, స్వామిని దర్శించుకుంటున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏలూరులో 66, పశ్చిమలో 93 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఏలూరులో 42,282, పశ్చిమలో 69,884 మంది ఓటర్లు
- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- ఏలూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం



ఏలూరు గిరిజన భవన్‌లో ఓటింగ్ సామగ్రిని తీసుకెళ్లేందుకు వచ్చిన సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. దాదాపు మూడు నెలల హోరాహోరీ ప్రచారానికి తెరపడగా.. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉభయగోదావరిలోని ఐదు జిల్లాల్లో పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ జరగనుంది. అదే విధంగా గుంటూరు, కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నూజివీడు, కైకలూరులో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉభయగోదావరి జిల్లాల్లో 456 పోలింగ్ బూత్‌ల్లో 3,14,984 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బుధవారం డివిజన్లవారీగా ఎన్నికల మెటీరియల్ పంపిణీ పూర్తి చేశారు. ప్రధానంగా కూటమి పార్టీ నుంచి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థిగా రిటైర్డ్ టీచర్ దిడ్ల వీరరాఘవులతో పాటు 33 మంది స్వతంత్రులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నా రు. ఏలూరు జిల్లా కలెక్టర్ కే వెట్రిసెల్వి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఏలూరు కలెక్టరేట్ కేంద్రంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించడానికి ప్రతి రెండు గంటలకు సమాచారం ఇవ్వడానికి, వెబ్ కాస్టింగ్ పరిశీలనకు వీలుగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఉభయగోదావరి జిల్లాల్లో 456 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసి ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పర్యవేక్షించనున్నారు. అలాగే గుంటూరు, కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో 21 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 16,099 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 80 బ్యాలెట్ బాక్సులు, 150 మంది సిబ్బందికి విధులు కేటాయించి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ద్వారా ఎన్నికల సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి



బ్యాలెట్ పేపర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

పట్టభద్రులందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ప్రాధాన్యతా క్రమంలో జరిగే ఎన్నికలు కావడంతో నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 నెంబరు వేయాలి. ఆ తర్వాత నచ్చిన అభ్యర్థుల ఎదురుగా 2, 3, 4.. ఇలా వరుస క్రమంలో వేయాలి. ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్ను మాత్రమే వాడాలి. 12 రకాల గుర్తింపు కార్డులను ఎన్నికల కమిషన్ నిర్దేశించిందని దానిలో ఆధార్ కార్డు, పాన్‌కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, డిపార్ట్‌మెంట్ ఫొటో గుర్తింపు కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాలా శాఖ జారీ చేసిన పాస్‌బుక్, పెన్షన్ డాక్యుమెంట్లు ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– కె.వెట్రిసెల్వి, ఏలూరు జిల్లా కలెక్టర్

ఓటర్ల వివరాలు

- ఏలూరు జిల్లాలో 66 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 24,704 పురుషులు, 17,571 మంది మహిళలు, థర్డ్ జెండర్ ఏడుగురు కలిపి 42,282 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.
- పశ్చిమగోదావరి జిల్లాలో 93 పోలింగ్ కేంద్రాల్లో 39,863 మంది పురుషులు, 30,187 మంది మహిళలు, థర్డ్ జెండర్ ఇద్దరు కలిపి 70,052 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నెంబర్లు 1950, 18002331077, హెల్ప్‌లైన్ 9491041419 నెంబర్లను ఏర్పాటు చేశారు.

456 కేంద్రాల్లో 2,283 మంది సిబ్బంది

ఉభయగోదావరి జిల్లాల్లో 456 పోలింగ్ కేంద్రాల్లో 2,283 మంది సిబ్బందిని నియమించారు. ఏలూరు జిల్లాలో 66 పోలింగ్ కేంద్రాల్లో, పశ్చిమలో 93 పోలింగ్ కేంద్రాల్లో, అల్లూరి జిల్లాలో 12, కోనసీమ జిల్లాలో 95, తూర్పుగోదావరి జిల్లాలో 92, కాకినాడ జిల్లాలో 98 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ముగించిన తరువాత బ్యాలెట్ బాక్సులు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తారు. ఉభయగోదావరిలో 1,368 బ్యాలెట్ బాక్సులను వినియోగించనున్నారు. ఏలూరు జిల్లాలో 8 మంది డీఎస్పీలు, 15 మంది సీఐలు, 37 మంది ఎస్సైలు, 69 మంది ఏఎస్సైలు, 691 మంది కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బందిని బందోబస్తుకు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ప్రత్తిపాడులో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



హ్యాండ్‌బాల్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన విజయనగరం జట్టుతో నిర్వాహకులు

పెంటపాడు: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో కళాశాలలో గత మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని ఆయుష్, ఫిజియోథెరపీలకు చెందిన 20 కళాశాలల టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. వాలీబాల్, క్రికెట్, టేబుల్‌టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, మహిళల విభాగంలో వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్, పోటీలు జరిగాయి. విజేతలను గురువారం ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏఎస్ఆర్ గ్రూప్ సంస్థల చైర్మన్ ఆకుల విజయవర్ధన్, వైస్ చాన్సలర్ నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఆరోగ్య విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఈ.త్రిమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు

నరసాపురం: ఈనెల 28 నుంచి మార్చి 31 మధ్య ప్రతి శుక్ర, ఆదివారాల్లో నరసాపురం, చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు నరసాపురం స్టేషన్ మేనేజర్ మధుబాబు చెప్పారు. ఈ నెల 28, మార్చి 7, 13, 21, 28 తేదీల్లో ట్రైన్ నెంబర్ 07233తో చర్లపల్లి నుంచి నరసాపురానికి, మార్చి 2, 9, 16, 23, 31 తేదీల్లో ట్రైన్ నెంబర్ 07234తో నరసాపురం నుంచి చర్లపల్లికి నడుస్తాయని చెప్పారు. చర్లపల్లి నుంచి రాత్రి 8.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.50 గంటలకు నరసాపురం వస్తాయన్నారు. నరసాపురం నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుకుంటాయని చెప్పారు.

మహాకుంభమేళాకు వెళ్లిన పెదనింద్రకొలను వాసి మృతి



ముంగర లక్ష్మి (ఫైల్)

నిడమర్రు: ప్రయోగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్లిన పెదనింద్రకొలను గ్రామానికి చెందిన ముంగర లక్ష్మి (60) అస్వస్థతతో మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదనింద్రకొలనుకు చెందిన లంకా రాంబాబు ఆధ్వర్యంలో 50 మంది వరకూ ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్లారు. పుణ్యస్నానం అనంతరం కాశీలో దర్శనం కోసం వెళుతుండగా మంగళవారం రాత్రి ముంగర లక్ష్మి అస్వస్థతకు గురైనట్లు గమనించిన తోటి ప్రయాణికులు ఆమెను దగ్గరలోని హాస్పటల్‌కు తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం ఆమె సహచరులు కుటుంబ సభ్యులకు తెలుపగా కుటుంబసభ్యుల కోరిక మేరకు ఆమెకు కాశీలోనే బుధవారం దహన సంస్కారాలు నిర్వహించారు. మృతురాలు లక్ష్మి భర్త గతంలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

పంట కాలువల నిర్వహణ ప్రైవేటుకు!

- గోదావరి డెల్టా పరిధిలో 4.60 లక్షల ఎకరాల సాగు భూమిపై ప్రభావం
- ఆలోచనను విరమించుకోవాలని ప్రభుత్వానికి రైతు సంఘాల డిమాండ్
- వ్యవసాయాన్ని మరింత నష్టాల బాటలో పెట్టే చర్యగా అభివర్ణన

ఏలూరు (టూటౌన్): నిత్యం ప్రైవేటీకరణ మంత్రం జపించే చంద్రబాబు కన్ను ఈసారి రైతులపై పడింది. వ్యవసాయానికి సాగునీరు అందించే పంట కాలువ నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించి కూటమి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోంది. గతంలో విఫల ప్రయోగంగా రుజువైన ఈ విధానాన్ని ఇప్పుడు బాబు మళ్లీ రాష్ట్రంపై రుద్దాలని చూడడాన్ని నిపుణులు సైతం తప్పుపడుతున్నారు.

జల వనరుల శాఖపై సమీక్ష సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పంట కాలువల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని జల వనరుల శాఖ అధికారులకు ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలపై పలు రైతు సంఘాల నాయకులు, మాజీ సాగునీటి సంఘాల నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయం సాగులో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని, దీనికి తోడు సాగులో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని తీసుకువస్తే ఈ నష్టాలు మరింత ఎక్కువై చివరకు సాగు భారంగా మారుతుందంటూ వారు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగంలోనూ ప్రైవేట్ భాగస్వామ్యాన్ని తీసుకువచ్చి క్రమంగా ఈ రంగం నుంచి తప్పుకోవాలనే ఆలోచన చేయడం దుర్మార్గమైన చర్యగా పలువురు అభివర్ణిస్తున్నారు.

11 ప్రధాన కాలువల ద్వారా సాగు నీరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గోదావరి డెల్టా పరిధిలో 11 ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీరు అందిస్తున్నారు. ఈ ప్రధాన కాలువల పరిధిలో మొత్తం 5,29,962 ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రధానమైన వరి పంట 4.60 లక్షల ఎకరాల్లో సాగు అవుతుంది. మిగతా ఆయకట్టులో చేపల చెరువులు, ఉద్యానవన పంటలు సాగు అవుతున్నాయి.



ఏలూరు-గోదావరి కాలువ

గోదావరి పశ్చిమ డెల్టాలో ప్రధాన కాలువలు, ఆయకట్టు వివరాలు

కాలువ పేరు	ఆయకట్టు ఎకరాల్లో	వరి సాగు ఎకరాల్లో
గోదావరి పశ్చిమ ప్రధాన కాలువ	12,998	12,978
ఏలూరు కాలువ	61,977	39,118
జంక్షన్ కాలువ	25,339	25,089
కాకరపర్రు కాలువ	23,481	23,423
బ్యాంకు కాలువ	46,617	46,123
నర్సాపురం కాలువ	91,105	87,284
అత్తిలి కాలువ	50,756	49,495
జీఅండ్‌వీ కాలువ	68,369	56,714
ఉండి కాలువ	81,488	61,731
వీఅండ్‌డబ్ల్యూ కాలువ	59,749	51,962
ఓడబ్ల్యూ కాలువ	8,083	6,083

కునారిల్లుతున్న ఇరిగేషన్ శాఖ

ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధి వ్యాపించి ఉంది. దీనిలో ఇరిగేషన్ సర్కిల్ ఏలూరు పరిధిలో ఏలూరు, నిడదవోలు, భీమవరం, కేఆర్‌పురం డివిజన్‌లు ఉన్నాయి. పోలవరం కేసీఐఆర్‌సీఎం సర్కిల్ పరిధిలో కొవ్వూరు, తాడేపల్లిగూడెం, ఏలూరు, జంగారెడ్డిగూడెం, నున్న డివిజన్‌లు ఉన్నాయి. ఒక్కో డివిజన్ పరిధిలో నాలుగు సబ్ డివిజన్‌లు, ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో నాలుగు సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తంగా ఇరిగేషన్ శాఖలో 40 శాతం వరకు ఉద్యోగుల ఖాళీలు ఉన్నాయి. ఏలూరు జిల్లాతో పోలిస్తే భీమవరం ప్రాంతంలో లస్కర్ వ్యవస్థ కొనసాగుతోంది. ఇరిగేషన్ కార్యాలయాలు చాలా చోట్ల శిథిలమై కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. సిబ్బంది కొరత, కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకోవడం వంటి కారణాలతో రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగునీరు అందించే ఇరిగేషన్ శాఖ కునారిల్లుతుంది.

ఈ ప్రయోగం గతంలోనే విఫలం

భూముల ప్రైవేటీకరణ, రహదారుల ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ ప్రైవేటీకరణ అన్నింటిని ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలానే ఆలోచన కొత్తది కాదని గతంలోనే ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో చంద్రబాబు పాలన జరిగిన 1996–2004 కాలంలోనే ఇది ముందుకు వచ్చిందని, అది ఒక విఫల ప్రయోగంగా రుజువు అయిందని వ్యవసాయ రంగ నిపుణులు గుర్తుచేస్తున్నారు. దాన్ని మళ్లీ ముందుకు తీసుకురావడం చూస్తుంటే చంద్రబాబు ఏమీ మారలేదని అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

గోదావరి బనకచర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, ఆ కార్పొరేషన్ ద్వారా రుణాల రూపంలో నిధులు సమీకరిస్తామని చెప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తగదని రైతు సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విఫల ప్రయోగాలను రాష్ట్రంపై రుద్దే ప్రయత్నాలను విరమించుకోవాలని రైతు సంఘాల నాయకులు, రైతులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా పంట కాలువల నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు ఇచ్చే దిశగా ముందడుగు వేస్తే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని పలువురు రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

రైతుల నడ్డి విరిచే చర్య



పంట కాలువల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా ఈ రంగం నుంచి క్రమంగా ప్రభుత్వం వైదొలగాని చూడటం రైతాంగాన్ని నడ్డి విరిచే చర్య. ఇప్పటికే రైతులు తీవ్ర నష్టాల ఊబిలో చిక్కుకుపోయి అల్లాడుతున్నారు. పంట కాలువల నిర్వహణ ప్రైవేట్ భాగస్వామ్యంలో అప్పగిస్తే రైతులు మరింత నష్టపోతారు. తక్షణం ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి.

– కె.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం, ఏలూరు

వ్యవసాయం అంటే చిన్నచూపే



వ్యవసాయం అంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొదటి నుంచీ చిన్న చూపే. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు పెద్ద పీట వేస్తూ ప్రపంచ బ్యాంకు విధానాలను రాష్ట్రంపై రుద్దడం ఆయనకు మొదటి నుంచీ అలవాటే. రాష్ట్రంలో ఇరిగేషన్ శాఖ ఆధీనంలోని పంట కాలువల నిర్వహణ నుంచి ప్రభుత్వం తప్పుకోవాలనే ఆలోచన చాలా దుర్మార్గమైనది. దీన్ని అందరూ ప్రతిఘటించాలి.

– గుత్తికొండ వెంకట కృష్ణారావు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, కైకరం

పునరాలోచన చేయాలి



స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇరిగేషన్ వ్యవస్థ ఒక విధానంలో అమలులో ఉంది. నిపుణులైన ఇంజనీర్లు, సిబ్బంది ఈ శాఖలో ఉన్నారు. వీరందరినీ పక్కన బెట్టి ప్రైవేట్ సంస్థలు, ఏజెన్సీలకు కాలువల నిర్వహణ బాధ్యత అప్పగించాలని చూడటం విడ్డూరంగా ఉంది. ప్రైవేట్ సంస్థలు రైతుల ప్రయోజనాల కోసం కాకుండా లాభాల కోసమే పనిచేస్తారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– జి.ప్రసాదరావు, రిటైర్డ్ జేడీ, వ్యవసాయ శాఖ, భీమడోలు

వైభవంగా నృసింహ మహాయజ్ఞం



మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్న నరసింహ గురూజీ



హోమగుండం వద్ద కొలువుదీరిన దేవతామూర్తులు



లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్వికులు

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రంలో అతిరుద్ర ప్రయోగ సహిత మహా సుదర్శన నృసింహ 31వ మహా యజ్ఞం బుధవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. సుదర్శన సంపుటితమైన 17 వేల రుద్రనామాలతో 1,331 కలశాలకు రుద్రపూజను ఘనంగా జరిపారు. ప్రతి ఏటా వలె హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన రుత్వికులు, పండితులు పాల్గొని, ఈ యజ్ఞ క్రతువును వైభవోపేతంగా నిర్వహించారు. స్వయంభూ శ్రీ లక్ష్మీ నారసింహునికి ఈ యజ్ఞం జరపడం వల్ల లోకశాంతి చేకూరుతుందని పండితులు తెలిపారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలో జరిగిన పలు కార్యక్రమాలతో సుందరగిరి పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉదయం విష్వక్సేన పూజ, మండపారాధనలు, అనంతరం శాలిగ్రామ అభిషేకం, రుద్ర పారాయణ, చతుర్వేద పారాయణ, శ్రీ విష్ణు సహస్రనామ, లక్ష్మీ సహస్రనామ పారాయణలు, సూర్య నమస్కారాలను రుత్వికులు వేడుకగా జరిపారు. ఆ తరువాత 1,331 కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశారాధన, విగ్రహ సుదర్శన ప్రతిష్ఠలు, అగ్ని ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆ తరువాత మహా యజ్ఞాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ లక్ష్మీనరసింహ గురూజీ తెల్లవార్లు జరిపారు. యజ్ఞకుండంలో స్వీట్లు, పండ్లు, ఔషధ లోహాలు వంటి పలు ద్రవ్యాలను వినియోగించారు. సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షణలో జరిగిన ఈ యజ్ఞ కార్యక్రమంలో అశేష భక్తజనంతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు, హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొన్నారు. యజ్ఞ క్రతువులో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తామని కుటుంబరావు తెలిపారు.

పెద్దింట్లమ్మ జాతరకు సర్వం సిద్ధం

- మార్చి 1 నుంచి 13 వరకు కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర
- 10న జలదుర్గా గోకర్ణేశ్వరస్వామి దివ్య కల్యాణం
- తెలంగాణ బోనాలు తరహాలో పెద్దింట్లమ్మ బోనాల సంప్రదాయం



కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి



గోకర్ణేశ్వరపురంలో గోకర్ణస్వామి



కొల్లేటికోట దేవస్థానం డ్రోన్ చిత్రం



కొల్లేటికోట దేవస్థానం వద్ద నిర్మించిన అనివేటి మండపం



అమ్మవారికి బోనాల సమర్పణ (ఫైల్)

కైకలూరు: కొల్లేటి మహాపట్టమహిషి పెద్దింట్లమ్మ జాతరకు సర్వం సిద్ధమయ్యింది. రాష్ట్రంలో అత్యంత పురాతన చరిత్ర కలిగిన దేవాలయాల్లో ఏలూరు జిల్లా, కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవాలయం ఒకటి. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకూ జరిగే ఉత్సవాల్లో ఫాల్గుణ శుద్ధ ద్వాదశి రోజున 'జలదుర్గ' మాతకు సమీప గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామితో జరిగే దివ్య కల్యాణం తిలకించడానికి ఇతర రాష్ట్రాల నుంచి సైతం లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి 13 వరకు అమ్మవారి జాతర జరగనుంది. జాతరలో అత్యంత కీలకఘట్టమైన జలదుర్గా గోకర్ణేశ్వరుల కల్యాణం మార్చి 10న రాత్రి నిర్వహించనున్నారు. కొల్లేరు సరస్సు మధ్యలో పెద్ద ద్వీపంపై పెద్దింట్లమ్మ తల్లి 9 అడుగుల ఎత్తులో, విశాల నేత్రాలతో వీరాసన భంగిమలో భక్తులకు దర్శనమిస్తారు. పిఠాపురం శాసనం బట్టి అగస్త్యుడు కొల్లేటికోట చుట్టూ 160 రాజ హస్తాల వెడల్పు, 40 రాజ హస్తాల ఎత్తు, 7 నిలువుల లోతు, 3 కోశాల చుట్టుకొలత కలిగిన పెద్ద అగడ్త ఉండేదని రాయబడింది. కాలాలతో పాటు కోటలు మాయమైనప్పటికీ పెద్దింట్లమ్మ తల్లి విగ్రహం చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. సామాన్యంగా ఒక గ్రామానికి ఒక దేవత ఉంటుంది. కానీ పెద్దింట్లమ్మ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 44 కొల్లేరు దిబ్బలపై నివసించే వారందరికీ కులదైవంగా ఆరాధింపబడుతున్నారు. రామాయణ అరణ్యకాండంలో అగస్త్య మహాముని శ్రీరాముడికి ఈ సరస్సు గురించి చెప్పినట్లు ఉంది.

కల్యాణం రోజున అమ్మకు బోనాలు

తెలంగాణలో మాదిరిగా కొన్నేళ్లుగా కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అమ్మవారి కల్యాణం రోజున బోనాలు సమర్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల కొల్లేరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మహిళలు మూడు మట్టి కుండలు ఒకదానిపై ఒకటి ఉంచి వాటిలో పానకం, పిండి వంట, వడపప్పు, చలివిడి నింపి చివరి కుండపై నెయ్యితో నింపిన దీపాన్ని ఉంచుతారు. బోనం చుట్టూ కలవపువ్వులు, వేపాకులు కడతారు. సమీప గ్రామాల నుంచి నడుచుకుంటూ వెళ్లి బోనాలు పెద్దింట్లమ్మకు సమర్పిస్తారు.

ఏర్పాట్లు పూర్తి



పెద్దింట్లమ్మ జాతరకు విచ్చేసే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిపాం. కోనేరులో కొత్త నీటిని నింపాం. చలువ పందిర్లు ఏర్పాటు చేయించాం. భక్తులకు తాగునీటిని అందుబాటులో ఉంచాం. పారిశుద్ధ్య కార్మికులు షిఫ్టుల ప్రకారం అందుబాటులో ఉంటారు. జాతరకు పూర్తి స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– కూచిపూడి శ్రీనివాసు, ఈవో, పెద్దింట్లమ్మ దేవస్థానం, కొల్లేటికోట

మహిమ గల తల్లి



పెద్దింట్లమ్మ ఆదిశక్తి స్వరూపిణి. ఎన్నో మహిమలు కలిగిన తల్లి. పెద్దింట్లమ్మ కోటశక్తి అందుకే కల్యాణం లేదు. అమ్మవారి విగ్రహం కింద జలదుర్గ మాత విగ్రహం ఉంటుంది. సమీప గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామితో జలదుర్గకు వివాహం చేయిస్తాం. దక్షిణ కాశ్మీరంగా పేరుపొందిన కొల్లేరు సరస్సు మధ్యలో అమ్మ దర్శనం మధురానుభూతిగా మిగులుతోంది.

– పేటేటి పరమేశ్వరశర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు, కొల్లేటికోట

పుణ్యస్నానానికి దిగి అనంత లోకాలకు..


బలివేలో స్నానానికి దిగి అన్నదమ్ములు మృతి




మునియ్య, మురళీ మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

లింగపాలెం/పెదవేగి: మహాశివరాత్రి పర్వదినాన ఏలూరు జిల్లా బలివేలో పుణ్యస్నానానికి దిగిన ఇద్దరు అన్నదమ్ములు తమ్మిలేరులో ప్రమాదవశాత్తూ మునిగిపోయి మృతి చెందారు. ఈ ఘటన ఆ కుటుంబానికి పుట్టెడు దుఃఖం మిగిలించింది. వివరాల ప్రకారం లింగపాలెం మండలం తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన పేరిచర్ల మునియ్య(25), అతని సోదరుడు మురళీ (22) పితృ దేవతలకు పిండ ప్రదానం చేయడానికి బలివేలో మహాశివరాత్రి ఉత్సవాలకు బుధవారం వెళ్లారు. స్నానం చేసి పిండప్రదానం నిర్వహించాల్సి ఉండడంతో ముందుగా స్నానం చేసేందుకు తమ్మిలేరు నదిలోకి దిగారు. నది లోతుగా ఉండటంతో ఇద్దరు అన్నదమ్ములు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. వీరి మృతి వార్తా తెలుసుకున్న తండ్రి మారేశ్వరరావు, కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. తిమ్మక్కపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెరువులో స్నానానికి దిగి ఇద్దరు గల్లంతు



సుబ్రహ్మణ్యం (ఫైల్)



కోటేశ్వరరావు (ఫైల్)

పెదపాడు: చెరువులో స్నానానికి దిగిన పినతండ్రి మునిగిపోతున్నట్లు గమనించి ఆయనను కాపాడబోయిన కుమారుడు సైతం మునిగిపోయి గల్లంతైన ఘటన పెదపాడు మండలంలోని వట్లూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వట్లూరు పెద్ద చెరువు గట్టుపై నివసిస్తున్న జుజ్జువరపు వెంకటేశ్వరరావు(58) బుధవారం బలివే క్షేత్రానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి స్నానమాచరించేందుకు చెరువులో దిగాడు. అయితే అతను చెరువులో మునిగిపోతుండగా అన్న కుమారుడు సుబ్రహ్మణ్యం (32) గమనించాడు. వెంటనే పినతండ్రిని రక్షించేందుకు నీటిలో దిగి ప్రమాదవశాత్తూ అతను కూడా మునిగిపోయి గల్లంతయ్యాడు. పశువుల కాపరులు ఈ విషయాన్ని గమనించి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రెస్క్యూ టీమ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు ఆచూకీ లభించలేదు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీల కేసులో పాత నేరస్తుడి అరెస్ట్

రూ.5.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



రికవరీ చేసిన చోరీ సొత్తుతో పోలీసులు

తణుకు అర్బన్: తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడిన పాత నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.5.20 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. తణుకు పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ కొండయ్య వివరాలు వెల్లడించారు. పెనుగొండ మండలం బాబూజీపాలెం గ్రామానికి చెందిన తానేటి ఆశీర్వాదం అలియాస్ టక్కును బుధవారం పాతవూరు పశువుల ఆస్పత్రి ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి 69.5 గ్రాములు బంగారు, 1,144 గ్రామల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు ఆశీర్వాదంపై గతంలోనూ తణుకు పట్టణంతోపాటు తణుకు, ఇరగవరం మండలాలు, పాలకొల్లు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో 40 కేసుల్లో అరెస్టు అయి అనేకసార్లు జైలుకు వెళ్లినట్లు వివరించారు. ఇప్పటికే పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉందన్నారు. ముఖ్యంగా తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా పగలు రెక్కీచేసి రాత్రి సమయంలో గునపాలు, ఇనుప రాడ్లతో తాళాలు, తలుపులను ధ్వంసం చేసి దొంగతనాలకు పాల్పడుతుంటాడని తెలిపారు. ముద్దాయిని అరెస్టు చేయడంలో తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్, ఏఎస్సై బి.పోలయ్య కాపు, హెడ్ కానిస్టేబుల్ ఎంవీవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు షేక్ అక్బర్ లాల్, డి.వెలగేశ్వరరావు, ఎం.శివాజీ, పి.రాంబాబు సహకరించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

అమ్మవార్లకు బోనాలు సమర్పణ



అత్తిలిలో అమ్మవార్లకు బోనాలు సమర్పించడానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అత్తిలి: అత్తిలి గ్రామదేవతలకు గాది నాగమణి ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. డప్పు వాయిద్యాలతో పాలకుండలను శిరస్సుపై పెట్టుకుని ఊరేగుతూ అమ్మవార్ల ఆలయాలకు చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం: అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్వరాజ్య లక్ష్మి తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గణపవరం మండలం ముగ్గళ్ల గ్రామంలో డ్యూటీపెయిడ్ మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఒక మహిళను గురువారం అరెస్టు చేశారు. మహిళను అదుపులోకి తీసుకొని పది బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈదాడిలో సబ్ ఇనస్పెక్టర్లు మురళీమోహన్, దొరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్లలో ఘనంగా వీరుల సంబరం



రాచర్ల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: మహా శివరాత్రి పురస్కరించుకొని రాచర్ల గ్రామంలో వీరుల సంబరం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులైన కోరుకొండ దుర్గారావు, అప్పల నరసమ్మల ఆధ్వర్యంలో వారి కుటుంబీకులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పురస్కరించుకొని జరిగిన ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని గ్రామోత్సవం నిర్వహించారు.

స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా



కొమ్ముగూడెం శివారులో స్తంభాన్ని ఢీకొని బోల్తా పడిన కారు

తాడేపల్లిగూడెం రూరల్: సిమ్మెంట్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా కొట్టిన సంఘటన మండలంలోని కొమ్ముగూడెం శివారు జామ తోట వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. అయితే, ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలు మినహా ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదని తెలుస్తోంది. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

ముదిగిన మృతికి సంతాపం



తణుకు అర్బన్: ఎలక్ట్రికల్ లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్స్ అండ్ అప్రంటీస్ (వర్కర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముదిగిన సత్యనారాయణ మృతికి అసోసియేషన్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. సంఘాన్ని బలోపేతం చేయడంతోపాటు సభ్యుల అభ్యున్నతికి ఎంతో పాటుపడిన సత్యనారాయణ మంగళవారం మృతిచెందడాన్ని సంఘ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారని అధ్యక్ష, కార్యదర్శులు కేతా విజయకుమార్, బళ్ల నాని తెలిపారు. మాజీ కార్యదర్శి ఒకాటి రాంబాబు, ఉపాధ్యక్షుడు ఉన్నమట్ల రామారావు, సహాయ కార్యదర్శి కాజులూరి పోతురాజు, కోశాధికారి ఉన్నమట్ల జాన్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు మనో ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని కోరారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

ఉండి: జీవితంలో అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఒక్కరూ ఉన్నత ఆశయాలతో ముందడుగు వేయాలని ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ పేరిష్ పాస్టర్ రైట్ రెవరెండ్ ఎం.మేషక్ సతీష్‌కుమార్, అడిషినల్ పాస్టర్ రెవరెండ్ అబ్బాలోమ్‌రాజు అన్నారు. 36 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు.

హరహర మహాదేవ శంభో శంకర

- రద్దీగా మారిన ప్రసిద్ధ శైవ క్షేత్రాలు
- వేకువజాము నుంచే పరమేశ్వరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు
- భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- శివనామస్మరణతో ఆలయాలకు పోటెత్తిన భక్తులు



తణుకు అర్బన్: కపర్దేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శైవక్షేత్రంలోని విశ్వేశ్వరస్వామి



పెంటపాడు: పెద్దశివాలయం వద్ద బారులుతీరిన భక్తులు



పెంటపాడు: మదన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం



పెంటపాడు: శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: శివరాత్రి సందర్భంగా తణుకు నియోజకవర్గంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం శివన్నారాయణుడిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలి రావడంతో శివాలయాలు కిక్కిరిసిపోయాయి. తణుకు పట్టణంలోని సజ్జాపురం ఉమా సోమేశ్వరస్వామి, పాతవూరు ఉమా సిద్ధేశ్వరస్వామి ఆలయం, పైడిపర్రు శ్రీభద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయం, తణుకు మండలం తేతలిలో పార్వతీ రాజేశ్వరి స్వామి ఆలయంలోను స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. క్యూలైన్ వచ్చే భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బారికేడ్లలోంచి క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూజాధికాలతోపాటు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తణుకు శ్రీకపర్దేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో సుమారు 10వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

శివనామ స్మరణతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

అత్తిలి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అత్తిలి మండలంలోగల శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. అత్తిలిలో ప్రసిద్ధిగాంచిన ఉమా సిద్ధేశ్వరస్వామికి బుధవారం తెల్లవారు జామున అభిషేకం, మధ్యాహ్నం ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి పాశుపతి సహిత ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తుల దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా అఖండ అన్నసమారాధన జరిపారు. అత్తిలి కుమ్మర వీధిలో గల శ్రీపార్వతి సమేత సోమేశ్వరస్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జామున శ్రీస్వామివారికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకించి విశేషంగా అలంకరణ చేసారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో అన్నదానం చేశారు.

శివనామస్మరణతో మార్మోగిన వీరంపాలెం

తాడేపల్లిగూడెం రూరల్: రెండవ దక్షిణ కాశీ తాడేపల్లిగూడెం మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపురా సుందరీ విద్య, ఆధ్యాత్మిక పీఠం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి పర్యవేక్షణలో మహాదేవునికి వివిధ రకాల నదీ జలాలు, మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, గురజాల జగన్మోహన్ స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, అడిషినల్ ఎస్పీ, డీఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్, రూరల్ సీఐ రమేష్ తదితరులు దర్శించుకున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్పటిక లింగాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో వీరంపాలెం గ్రామం భక్తజన సంద్రంగా మారింది. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం శివపార్వతుల దివ్య కల్యాణం, లక్ష జ్యోతిర్లింగార్చన, లింగోద్భవ కాల అభిషేకం, లక్ష జ్యోతిప్రజ్వలన, జాగరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తుల రాక కొనసాగింది. వీరంపాలెం శైవక్షేత్రానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేయడంతో భక్తులు విరివిగా స్వామివారిని దర్శించుకున్నారు. పీఠం ప్రతినిధులు సందీప్, శశి కుమార్, అర్చకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ): పెద్ద శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



అత్తిలి: సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: పైడిపర్రు భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రాలు శివ నామస్మరణలతో మారుమ్రోగాయి. పంచామృత అభిషేకాలతో పాలాభిషేకాలతో, నారికేళాలతో, అరిటిపండ్లతో విశేష పూజలు జరిగాయి. ఆలయాలు వద్ద క్యూలైన్‌లలో భక్తులు కిటకిటలాడారు. భక్తులు స్వామి వార్లను దర్శించి పునీతులైయారు. హాజరైన భక్తులకు అన్నసమారాధనలు, ప్రసాదాలు అందజేశారు. స్థానిక ఏలూరు కాలువ వద్ద పెద్ద శివాలయంలో మల్లిఖార్జునస్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకులు ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారికి భక్తులు ఫల, పుష్ప కానుకల సమర్పించారు. స్వామి వారికి పుష్పాలంకరణ జరిగింది. అదే విధంగా వివిధ ఆలయాలలో వాసవి ఆలయం, శంకరమఠం, షిర్డి సాయి ఆలయం వద్ద, చిన్న శివాలయం, జువ్వల పాలెం పురాతన శివాలయం, పట్టణంలోని ఇతర శివాలయాలలో శివరాత్రి పురస్కరించుకొని విశేష పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సత్యసాయి సేవా సమితిలో రుద్రాభిషేకం

స్థానిక సత్యసాయి మందిరంలో సత్యసాయి సేవా సమితి వారిచే బుధవారం గాదె శ్రీరామచంద్రమూర్తి బ్రహ్మత్వంలో రుద్రాభిషేకం జరిగింది. ఉదయం నగర సంకీర్తన, అనంతరం విశేష పూజలు జరిగాయి. ఆకుల సవీన్ బాబా, శ్రీ లక్ష్మి, ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు, విష్ణుమూర్తి, డాక్టర్ దుర్గదాస్, రుద్ర సాయిబాబా, తిరుపతి రాయుడు, ప్రవా శ్రీనివాస్, మల్లిఖార్జునరావు, సూర్యచంద్రరావు, ఆకుల వెంకటేశ్వరరావు, పాదం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

ఇరగవరం : మండలంలోని మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. కె ఇల్లిందలపర్రు, తూర్పు విప్పర్రు, రాపాక, కంతేరు, కొత్తపాడు, కాకిలేరు, ఏలేటిపాడు, పేకేరు, ఒగిడి, అయినపర్రు, శివాలయల్లో, ప్రసిద్ధి చెందిన ఇరగవరం పాలేశ్వరస్వామి, గోటేరు శివాలయం, రేలంగి తాటకేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పెంటపాడు: మండలంలో పలు శివాలయాల్లో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పెంటపాడు పెద్దశివాలయంలో తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు దర్శనాల కోసం బారులు తీరారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసారు. మంగళవారం రాత్రి స్వామివారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. అలంపురం మదన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పల్లకీలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. రాచర్ల రామలింగేశ్వరస్వామి, బోడపాడు శివాలయం, వల్లూరుపల్లి శనైశ్చర ఆలయం, దర్శిపర్రు పార్వతి బ్రహ్మలింగేశ్వర ఆలయం, విప్పర్రు సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం పలు ప్రాంతాలలో శివ రాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- డివిజన్‌లో 21,176 మంది ఓటర్లు
- 31న పోలింగ్ కేంద్రాలు

తాడేపల్లిగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గూడెం రెవెన్యూ డివిజన్‌లో ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి.తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఇరగవరం, తణుకు, అత్తిలి మండలాలలో మొత్తం 31 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దీనికి సంబంధించి ఐదు రూట్‌లను ఏర్పాటుచేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద అసౌకర్యం లేకుండా హెల్ప్‌డెస్కులను ఏర్పాటుచేశారు. పోలింగ్ ప్రక్రియకు కావాల్సిన మెటీరియల్‌ను పోలింగ్ ఆఫీసర్లకు, ఓపీఓలకు ఇచ్చి పంపించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నియమించారు. పోలింగ్ సమయంలో కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖకు ఆదేశాలు ఇచ్చారు. వైద్యసాయం కోసం మెడికల్ సౌకర్యాన్ని కలుగచేశారు.

31 పోలింగ్ కేంద్రాలు

- రెవెన్యూ డివిజన్‌లో 31 పోలింగ్ కేంద్రాల్లో 21,176 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



గూడెంలోని పోలింగ్ కేంద్రం

- తాడేపల్లిగూడెం-పోలింగ్ కేంద్రాలు -10-మొత్తం ఓటర్లు -6464-పురుషులు -3662-మహిళలు-2719
- పెంటపాడు-1863-పురుషులు-1103-మహిళలు-760
- ఇరగవరం -1978-పురుషులు-1114- మహిళలు-864
- తణుకు - 8581-పురుషులు-4619-మహిళలు-3922
- అత్తిలి-2290-పురుషులు-1338-మహిళలు-935

ఉచిత హోమియో మొబైల్ వైద్య శిబిరం



ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పాలకొల్లుకు చెందిన శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పటల్ వైద్యులు డాక్టర్ కోసూరి రామకృష్ణానందరాజు (డాక్టర్ పోడూరు రాజు) ఆధ్వర్యంలో టెలి కాలింగ్ వైద్య సేవలు అందజేశారు. ప్రతి రోజు ఒక్కో గ్రామంలో ఉచితంగా అందించే వైద్యసేవల్లో భాగంగా బుధవారం తణుకు మండలం వేల్పూరులో ఏర్పాటు చేసిన శిబిరంలో హాజరైన 37 మందికి టెలి కాలింగ్ ద్వారా మొబైల్ వైద్యసేవలు అందజేశారు. రోగుల ఇబ్బందులు తెలుసుకొని దీర్ఘకాలిక వ్యాధులు సైతం తగిన సలహాలు సూచనలు ఇచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుణ్ణం నాగమణి తెలిపారు. తణుకు జోన్ స్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిసాయి. ఈ పోటీల్లో తణుకు, అత్తిలి, ఇరగవరం మూడు మండలాల్లో క్రీడాకరులు కబడ్డీ, వాలీబాలు, ఖోఖో, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 28వ తేదిన శృంగవృక్షంలో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తణుకు కో ఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ, తణుకు జోన్ కన్వీనర్ కటికతల బాబురావు, వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్ సతీష్, కె సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

శివాజ్ఞ చిత్రం పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రశాంత వాతావరణంలో మానసిక సంతోషం ఉంటుందని, ఆధ్యాత్మిక చింతన ద్వారా జీవితాన్ని సుఖమయం చేసుకోవచ్చునని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక శివపరమాత్మ మందిరంలో బుధవారం మందిర నిర్వాహకులు బీకే ఆదినారాయణ అధ్యక్షతన మహాశివరాత్రి పర్వదినం జరిపారు. ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. నిర్వాహకులు సృష్టికర్త శివపరమాత్మ, శివ రాత్రి విశేషాలు, ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చారు. ఇటీవల మందిర నిర్వాకులు ఆధ్వర్యంలో శివాజ్ఞ చిత్రంను పట్టణంలోను, ఇతర ప్రాంతాలలో చిత్రీకరించారు. ఆ చిత్రం పోస్టర్‌ను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. బ్రమ్మకుమారీలు స్వప్న, బాబ్జి, కన్నబాబులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- కంపుకొడుతున్న గ్రామాలు
- మరింత అధ్వానంగా దళిత వాడలు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- పెంటపాడు మండలం వ్యాప్తంగా ఇదే దుస్థితి
- పలు గ్రామాల్లో వైరల్ జ్వరాల ముప్పు



వల్లూరిపల్లిలో శివాలయం వద్ద రోడ్డుపై మురుగునీరు



ప్రసిద్ధి చెందిన శనైశ్వరుని ఆలయం వద్ద అపారిశుద్ధ్యం



వల్లూరుపల్లిలో చెత్తకుప్పలు

పెంటపాడు: క్షీణించిన పారిశుద్ధ్యంతో పల్లెలు సతమతమవుతున్నాయి. మురుగు సమస్యతో అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఇళ్లలోని వాడుకనీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వల్లూరుపల్లి గ్రామంలో అపారిశుద్ధ్యం పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం మురుగు కూపాలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో రెండో మందేశ్వరస్వామి (శనైశ్చరుడు)గా పేరొందిన ఈ ఆలయం వెలుపల మురుగునీరు పేరుకుపోయి, అపారిశుద్ధ్యం నెలకొంది. మరో పక్క డ్రెయినేజీల శుభ్రత లేక దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిని పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారు. ప్రధానంగా ఈ గ్రామం జనసేన మండల అధ్యక్షుడి స్వగ్రామం కావడం గమనార్హం. ఈ ఊర్లోనే ఇలా ఉంటే మిగతా గ్రామాల్లో ఎలా ఉంటుందో చెప్పనక్కర లేదు. గ్రామంతో పాటు, పలు గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం, దోమల మందు, ఫ్యాగింగ్ వంటి చర్యలు కానరావడం లేదు. ప్రభుత్వం ఇటీవల స్వచ్ఛఆంధ్ర- స్వర్ణ ఆంధ్రా పేరుతో ఒక రోజు అధికారులు, ప్రజాప్రతినిధులు చెత్తను నిర్మూలించినట్లు హడావుడి చేశారు. పలు పంచాయతీల్లో వారానికి ఒక సారైనా ఆ చర్యలు కానరావడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ హయంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో ఎన్నో శానిటేషన్ కార్యక్రమాలు జరిగేవి. అధికారులు గ్రామాల్లో ప్రత్యేక దృష్టితో చెత్తను నిర్మూలించే వారు. ప్రత్యేక రిక్షాల ద్వారా చెత్తను తరలించేవారు. నేడు పలు గ్రామాల్లో రిక్షాలు మూలన పడేసి, ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. అయితే అన్ని వీధుల్లో అవి తిరగక ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. పైగా చెత్తను డపింగ్ యార్డులకు తరలించకుండా ఊరి శివార్లలో వేస్తున్నారు.

పలు గ్రామాల్లో ఇదేతీరు

వల్లూరుపల్లి, రాచర్లతో పాటు, ప్రధానంగా కె.పెంటపాడులో పెంటపాడు వెళ్లే దారిలో చెత్త వల్ల రోడ్డు అధ్వానంగా మారింది. అదే గ్రామంలో లోలెవిల్ కాల్వకు ఆనుకొని ఉన్న కాలనీలో మురుగునీరు లాగక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీలు దుర్వాసన వస్తోందని అక్కడి వాసులు చెబుతున్నారు. ఈ గ్రామంతో పాటు, వల్లూరుపల్లి, రాచర్ల, అలంపురం, జట్లపాలెం గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది. పలు గ్రామాల్లో తాగునీరు కూడా కలుషితమవుతోంది. ప్రధానంగా పంట, తాగునీటి కాలువలు ఉన్న గ్రామాల్లో చెత్తను పంచాయతీలకు తరలించకుండా కాలువలను డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. అలంపురం, ప్రత్తిపాడు, దర్శిపర్రు గ్రామాలతో పాటు, జట్లపాలెం మిడ్ లెవిల్ కాలువ ప్రాంతాల్లో కె. పెంటపాడు, బిళ్లగుంట, ప్రాంతాలలోని కాలువలో చెత్తను వేయడం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. ప్రధానంగా కాలువ కింద ఉన్న గ్రామాల్లో అదే నీటిని చెరువులకు పెట్టుకోవడంతో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. రాచర్ల, వల్లూరుపల్లి గ్రామాల్లో ప్రధానంగా అత్యధికులు కాలువలో చెత్తను వేస్తున్నారు. దీనిని పంచాయతీలు అడ్డుకోవడం లేదు. ఆయా పంచాయతీలు జరిమానా వేస్తామని హెచ్చరిక బోర్డులు పెట్టినా లెక్కచేయడం లేదు. దీంతో ఏంచేయాలో తెలియడం లేదని కార్యదర్శులు, సర్పంచ్‌లు వాపోతున్నారు. తక్షణం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అత్తిలి డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు



అత్తిలి డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దశికవంశీ

అత్తిలి: పట్టభద్రుల నియోజవర్గ ఎన్నికలకు సంబంధించి అత్తిలి డిగ్రీ కళాశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ దశికవంశీ తెలిపారు. బుధవారం ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్తిలి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 1334 మంది పురుషులు, 928 మంది స్త్రీల ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

రాయకుదురులో చెడుగుడు పోటీలు

వీరవాసరం: క్రీడల ద్వారా మానసిక ఉత్తేజం కలుగుతుందని రాయకుదురు గ్రామ సర్పంచ్ గెద్దం భారతి తెలిపారు. రాయకుదురు శివారు జగన్నాథరావు పురంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటల పోటీల వలన యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజాభివృద్ధికి పాటుపడి మంచి లక్షణాలు కలిగి ఉంటారన్నారు. క్రీడాకారులు, క్రీడా అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను విజయవంతం చేయాలని కోరారు.